https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 13 బుధవారం 6-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

### రూ. 1.52 లక్షల కోట్లతో అభివృద్ధి పథకాలకు గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, మే 5:**
దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ ఇవాళ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ. 1 లక్ష కోట్లను కేటాయించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది. టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ. 868 కోట్లు మంజూరు చేశారు. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద - మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 16,403 కోట్లు, గుంతకల్ - వాడి లైన్ నిర్మాణానికి రూ. 4,758 కోట్లు కేటాయించారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. బుర్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ. 2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. దీంతోపాటు, సుప్రీంకోర్టులో మరో నలుగురు న్యాయమూర్తులను పెంచడానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది.

# మార్పిడి అత్యవసరం

## వరి పెరుగుతోంది.. కూరగాయల సాగు తగ్గుతోంది..

**2014 తర్వాత వ్యవసాయం గాడి తప్పింది.. దారిలో పెట్టాలి**

**ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీలు కావాలి**

**కూరగాయల క్లస్టర్ పెట్టాలి.. దళారీలను నియంత్రించాలి**

**పప్పులు, చిరుధాన్యాలు, నూనె గింజలకూ 'మద్దతు' ఉండాలి**

**పంటల మార్పిడి నివేదికలో రైతు కమిషన్ సిఫార్సులు**

**పంటల మార్పిడిపై అసెంబ్లీలో చర్చ పెడదాం**

**నిర్మాణాత్మక సూచనలు ఇవ్వండి: కమిషన్ బృందంతో సీఎం**



**హైదరాబాద్, మే 5**
తెలంగాణలో పంటల మార్పిడి అత్యవసరమని రైతు కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఏటా వరి విస్తీర్ణం పెరుగుతూ.. కూరగాయలు, ఉద్యాన పంటల సాగు తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. సుస్థిర వ్యవసాయం, రైతు ఆదాయం పెంపు, సహజ వనరుల సంరక్షణ, భవిష్యత్ ఆహార భద్రత కోసం రాష్ట్రంలో పంటల మార్పిడికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. వాతావరణ జోన్ల ఆధారంగా పంటల ప్రణాళికను రూపొందించాలని.. పంటల మార్పిడి లక్ష్యాలను నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సంవత్సరాల వారీగా, గ్రామాల వారీగా నిర్ణయించాలని కమిషన్ సూచించింది. రాష్ట్రంలో దళారీ వ్యవస్థ సమస్య ప్రధానంగా ఉందని పేర్కొంది. కేరళ తరహాలో రాష్ట్రంలో కూరగాయల క్లస్టర్‌ను, నాసిక్‌లోని సహ్యాద్రి ఫార్మ్స్ తరహాలో ఎఫ్‌పీవోలను ప్రోత్సహించాలని సూచించింది. రాష్ట్రంలో పంటల మార్పిడి అంశంపై రైతు కమిషన్ రూపొందించిన నివేదికను మంగళవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసింది. మొత్తం 40 పేజీల నివేదికలో ఉద్యాన, సాంప్రదాయ, ఇతర ముఖ్య పంటల వివరాలను, ఇతర రాష్ట్రాల్లో చేసిన అధ్యయనం వివరాలను, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను వివరంగా పేర్కొంది. పప్పు ధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎ?సపీ) నిర్ణయించాలని.. ఇందుకోసం రైతులు సభ్యులుగా ఉండే ప్రత్యేక ధరల నిర్ణయ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించింది. పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరింది. రాష్ట్రంలో మార్కెట్లను సందర్శించినప్పుడు దళారీ వ్యవస్థ ప్రధాన సమస్యగా ఉన్నట్టుగా గుర్తించామని, దాన్ని నియంత్రించాలని సూచించింది.

**ప్రస్తుత పరిస్థితి.. గుర్తించిన సమస్యలివీ..**
రైతు కమిషన్ నివేదికలో పేర్కొన్న ప్రకారం.. తెలంగాణలో 2013-14లో 35.38 లక్షల ఎకరాల్లో వరి సాగయితే.. 2024-25 నాటికి సుమారు 127.03 లక్షల ఎకరాలకు పెరిగింది. అదే సమయంలో కూరగాయల సాగు 5.45 లక్షల ఎకరాల నుంచి 1.02 లక్షల ఎకరాలకు తగ్గింది. రాష్ట్రంలో పసుపు సాగు 1,52,445 ఎకరాల నుంచి 42,246 ఎకరాలకు, చెరుకు 95,348 ఎకరాల నుంచి 51,482 ఎకరాలకు పడిపోయాయి. కనీస మద్దతు ధర, ప్రభుత్వ సేకరణపై ఆధారపడి పత్తి, వరి పంటల సాగు పెరిగింది. ఇలా ఒకే రకమైన పంటల సాగుతో నేల సారం దెబ్బతిన్నది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. ప్రత్యామ్నాయ పంటలకు మద్దతు ధర, మార్కెటింగ్, ఎగుమతుల సదుపాయాలు లేకపోవడం, విత్తనాల లభ్యత లేకపోవడంతో సాగు తగ్గింది. ఇక కోతులు, అడవి పందులు, జింకల వంటి వన్యప్రాణుల బెడద కూడా కూరగాయలు, ఉద్యాన పంటల సాగు తగ్గడానికి కొంత ప్రభావం చూపిందని రైతు కమిషన్ నివేదికలో పేర్కొంది.

**2014 తర్వాత గాడితప్పిన వ్యవసాయం**
తెలంగాణలో 2014 తర్వాత వ్యవసాయం గాడి తప్పిందని, దాన్ని సరిచేయాల్సిన అవసరం ఉందని రైతు కమిషన్ నివేదికలో పేర్కొంది. వరి, పత్తి కొనుగోలు విషయంలో భవిష్యత్‌లో కేంద్రం ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఈ క్రమంలో ఉద్యాన పంటలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు, పసుపు, చెరుకు వంటివాటి విస్తీర్ణం పెంచితే ప్రయోజనం ఉంటుందని సూచించింది. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ఉండాలని సూచించింది. పంటల బీమా, రుణ సౌకర్యాలను వరి, పత్తితో పాటు ఇతర ముఖ్యమైన పంటలకు కూడా అమలు చేయాలని పేర్కొంది. రాష్ట్ర జనాభాకు అవసరమైన కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని.. ఈ పరిస్థితిని అధిగమించాలంటే కూరగాయల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి అవసరమని రైతు కమిషన్ పేర్కొంది. రైతులకు కూరగాయల విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, కూరగాయల పందిళ్ల ఏర్పాటుకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించింది. వివిధ జిల్లాల్లో సాగవుతున్న పంటలకు ప్రాసెసింగ్ సదుపాయాలు, ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీ యూనిట్లు ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఉద్యాన పంటల కొనుగోళ్ల కోసం ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించింది. కూరగాయల విత్తనోత్పత్తి కీలకమని, రాష్ట్రంలోనే విత్తనోత్పత్తిని ప్రోత్సహించాలని సిఫారసు చేసింది. కోతులు, వన్యప్రాణుల బెడదను అధిగమించడానికి నాబార్డు సహకారంతో సోలార్ ఫెన్సింగ్‌పై రాయితీ ఇవ్వాలని సూచించింది.

# జోన్ వచ్చిందోచ్..

**విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్.. గెజిట్ విడుదల**

**జోన్, డివిజన్ల పరిధి స్పష్టీకరించిన కేంద్రం**

**దక్షిణ మధ్య, తూర్పు కోస్తా రైల్వే జోన్లలోని కొన్ని భాగాలతో కొత్తగా దక్షిణ కోస్తా జోన్**

**దీని పరిధిలోకి గుంతకల్, గుంటూరు, బెజవాడ, వాల్తేరు డివిజన్లలోని కొన్ని భాగాలు**

**రాయగడ, విశాఖ డివిజన్లుగా 'వాల్తేరు' విభజన**

**నాలుగు దశాబ్దాల కల సాకారం**

**భూమి అప్పగింతలో నాడు వైసీపీ నిర్లక్ష్యం**

**కూటమి రాకతో జోన్‌కు ఎట్టకేలకు జోష్**




**విశాఖపట్నం, మే 5**
విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అనేది నాలుగు దశాబ్దాల కల. రైల్వే మంత్రిత్వ శాఖ సోమవారం రాత్రి విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌తో ఎట్టకేలకు అది సాకారమైంది. జూన్ ఒకటో తేదీ నుంచి విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభమవుతాయని ఆ గెజిట్‌లో కేంద్రం ప్రకటించింది. 'దక్షిణ కోస్తా జోన్' పేరుతో ఏర్పాటైన ఈ రైల్వే జోన్ కోసం ఉత్తరాంధ్ర ప్రజలు రాజకీయాలకు అతీతంగా సుదీర్ఘ పోరాటం చేశారు. రాష్ట్ర విభజన తరువాత ప్రత్యేక రైల్వే జోన్ లేకుండానే ఆంధ్రప్రదేశ్ ఇన్నాళ్లూ నడిచింది. ప్రధాని నరేంద్రమోదీ 2019 ఎన్నికల ప్రచారంలో విశాఖపట్నం వచ్చినపుడు రైల్వే జోన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని హామీ అమలు కావడానికి ఏడేళ్ల సమయం పట్టింది. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించిన తరువాత ప్రధాన కార్యాలయం నిర్మాణానికి అప్పట్లో కేంద్ర ప్రభుత్వం రూ.150 కోట్ల వరకు మంజూరు చేసింది. అయితే అవసరమైన భూముల కేటాయింపులో నాటి వైసీపీ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది. ఒక విధంగా రైల్వే జోన్ కార్యకలాపాలు ముందుకువెళ్లకుండా మోకాలడ్డు పెట్టిందనే చెప్పాలి. విశాఖపట్నంలో బీఆర్‌టీఎస్ రహదారులకు, ఇతర అవసరాలకు రైల్వేకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకుంది. వాటికి ప్రత్యామ్నాయంగా ముడసర్లోవలో 52.2 ఎకరాలు కేటాయించింది. నగరానికి దూరంగా ప్రశాంతంగా ఉండే ఆ భూముల్లోనే రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అయితే ఆ భూముల్లో అప్పటికే ఆక్రమణదారులు ఉన్నారు. రైల్వే అధికారులు ఆ భూముల్లోకి వెళ్లినప్పుడల్లా రైతులు అడ్డుకునేవారు. దాంతో పనులు ముందుకుసాగలేదు. ఆక్రమణదారులను అక్కడి నుంచి పంపించి భూములు అప్పగించడంలో నాటి వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. ఈ క్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒకసారి విశాఖపట్నం రాగా బీజేపీ నాయకులు రైల్వే జోన్ కార్యాలయం పనులు ప్రారంభించాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ నాటి జిల్లా కలెక్టర్ మల్లికార్జునను పిలిచి, రైల్వేకు భూములు ఇస్తే వారం రోజుల్లోనే పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. అయినా వైసీపీలో వీసమెత్తు చలనం రాలేదు. భూమి అప్పగించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైల్వే జోన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ముడసర్లోవ భూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో ఆ గ్రామం సర్వే నంబర్లు 57, 58, 59/1, 61/1, 62, 63,64,65 (పాత సర్వే నంబరు26)లలో 52.22 ఎకరాల భూమిని అదే ఏడాది ఆగస్టు నెలాఖరున రైల్వే అధికారులకు దగ్గరుండి ఇప్పించింది.


## రాజీనామా చేయనంటే డిస్మిస్సే



**గువాహటి:**
పశ్చిమబెంగాల్‌లో తాను ఓడిపోలేదని, రాజీనామా చేసేది లేదని టీఎంసీ అధినేత్రి మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. 'అప్పుడు ఒకటే మార్గం ఉంటుంది. డిస్మిస్ చేయడమే' అని ఒక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. చాలా కాలంగా ఆమెను ప్రజలు భరిస్తూ వచ్చారని వ్యాఖ్యానించారు. మూడుసార్లు అధికారంలో కొనసాగిన మమతా బెనర్జీ తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మంగళవారంనాడు మీడియా సమావేశంలో ఘాటుగా స్పందించారు. బెంగాల్‌లో తాను బీజేపీతో పోరాడలేదని, ఆ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘంతో పోరాడానని, తన జీవితంలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని అన్నారు. ప్రధాని ఎన్నికల కమిషనర్‌ను 'విలన్'గా పేర్కొన్నారు. ఎన్నికల సంఘంతో కలిసి బీజేపీ గేమ్ ఆడిందని, 100 స్థానాలను బీజేపీ లూటీ చేసిందని అన్నారు. ఇది తమ ఓటమి కాదని, అందువల్ల రాజీనామా చేయనని, రాజ్‌భవన్‌కు వెళ్లనని చెప్పారు. మమతాబెనర్జీ రాజీనామాకు నిరాకరిస్తే రాష్ట్రపతి పాలన అమల్లోకి తెచ్చే అవకాశాలుండవచ్చని వినిపిస్తుండగా, ఆ అవసరం లేదని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల గడువు ముగియడానికి ముందే గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా గవర్నర్ ఆహ్వానిస్తే చాలని పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్ ప్రస్తుత అసెంబ్లీ గడువు మే 7తో ముగియనుంది. అయితే రెండ్రోజుల తర్వాత మే 9న కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి బీజేపీ సన్నాహాలు చేస్తోంది.

## దేశవ్యాప్తంగా పెను సంక్షోభం పొంచి ఉంది..

### బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది: కేజ్రీవాల్




**న్యూఢిల్లీ, మే 5:**
పశ్చిమ బెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించిన తర్వాత, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా ఒక ప్రధాన రాజకీయ సంక్షోభం పొంచి ఉందని, బీజేపీ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతోందని ఆయన ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమిని, అస్సాంలో బీజేపీ పట్టును ప్రస్తావిస్తూ.. అధికార బలం, దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని విపక్షాలను అణచివేస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఓటమి పాలవ్వడం ప్రజాస్వామ్యానికి చేటని, ఇది కేవలం ఒక రాష్ట్ర ఎన్నికల ఫలితం మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుపై దీని ప్రభావం ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ విజయం సాధించిన విధానం సరైనది కాదని, త్వరలోనే దేశం తీవ్రమైన రాజకీయ, సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కోబోతోందని హెచ్చరించారు.

### బెంగాల్‌కు బీజేపీ కేంద్ర పరిశీలకుడిగా

## అమిత్‌షా, అస్సాంకు జేపీ నడ్డా



**న్యూఢిల్లీ, మే 5 :**
పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్ర నాయకత్వం సన్నాహాలు ప్రారంభించింది. రెండు రాష్ట్రాలకు కేంద్ర పరిశీలకులను మంగళవారంనాడు నియమించింది. బీహార్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కేంద్ర పరిశీలకునిగా నియమితులయ్యారు. కో-అబ్జర్వర్‌గా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ వ్యవహరిస్తారు. బెంగాల్ బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ నేత ఎంపికను కేంద్ర పరిశీలకులు పర్యవేక్షిస్తారు. దీంతో ముఖ్యమంత్రి ఎన్నికకు, ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమవుతుంది. మే 9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది. కాగా, అస్సాంకు కేంద్ర పరిశీలకుడిగా బీజేపీ మాజీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా నియమితులయ్యారు. ఆయనకు అసోసియేట్‌గా హర్యానా ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనీ వ్యవహరిస్తారు. అస్సాంలో లెజిస్లేచర్ పార్టీ నేత ఎంపికను వీరు పర్యవేక్షిస్తారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ 207 సీట్లు గెలుచుకుని పూర్తి మెజారిటీని సాధించగా, అస్సాంలో 82 సీట్లతో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

# పోడు జీవుల గోడు...



అటవీభూముల విషయంలో కాంగ్రెస్ సర్కారు రెండు నాల్కల ధోరణి విస్మయం కలిగిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అటవీ ప్రాంతాన్ని చెరబట్టబోయి భంగపడిన సంగతి తెలిసిందే. అదే సర్కారు గిరిజన ప్రాంతాల్లోని భూములను అటవీ భూములంటూ నానా హంగామా చేస్తున్నది. అడవిబిడ్డలను కడగండ్లపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన్న ఘోర దురాగతాలు ఇన్నీఅన్నీ కావు. విద్యార్థులు, బుద్ధిజీవులు కలిసిపోరాడితే గానీ కేంద్ర వర్సిటీ భూములను కాపాడుకోవడం సాధ్యపడలేదు. కానీ, అమాయక గిరిజనుల విషయం అలా కాదు. కొండల్లో, కోనల్లో జీవనం సాగించే అడవి బిడ్డలు పోడు భూములను కాపాడుకునేందుకు నానా అగచాట్లు అనుభవించాల్సి వస్తున్నది. పోలీసుల బూట్ల కింద తండాలు, గూడేలు నలిగిపోతున్నాయి. ప్రతిఘటిస్తే దయాదాక్షిణ్యాలు చూపకుండా, ఆడామగా అనే తేడా లేకుండా నరకం చూపిస్తున్నారు. నిన్నామొన్నటి లగచర్ల నుంచి రంగంపేట, కోసగుంపు వరకు ఇదే తతంగం. 'ప్రాణాలైనా వదులుకుంటం కానీ భూములను వదులుకోబోమ'ని గిరిజనులు అంటే సర్కారు పోలీసు లాఠీని ప్రయోగించి దమనకాండకు దిగుతున్నది. వారు మన పౌరులు, మనం కాపాడాల్సిన పౌరులు అనే స్పృహ లేకుండా తరిమితరిమి కొడుతున్నది. మహిళలపై హింస ప్రయోగించడం సర్కారు కర్కశత్వానికి పరాకాష్ఠ. ఇది ఏ తరహా ప్రజాపాలన? మొన్నటికిమొన్న రాజన్న సిరిసిల్లా జిల్లాలోని రంగంపల్లిలో పోడు భూములపైకి సర్కారు దండెత్తింది. ఎవుసమే జీవనాధారంగా బతికే రైతన్నల నోటికాడి ముద్ద ఎత్తగొట్టేందుకు సమకట్టింది. ఇంకా పట్టాలివ్వని పోడు భూములను అటవీ భూములంటూ వితండవాదం ముందుకుతెచ్చింది. ప్లాంటేషన్ పేరుతో లాగేసుకునేందుకు సర్కారు ఎత్తులు వేసింది. ఊరు ఊరంతా ఒక్కటై ఎదురుతిరగడంతో తోకముడిచింది. ఇక భద్రాద్రి జిల్లా కోసగుంపులో జరిగిన దారుణాలు లగచర్ల దురాగతాలను మరిపించేలా ఉన్నాయి. శత్రు దేశంపైకి శతఘ్నులు తోలినట్టుగా అక్కడి భూములపైకి సర్కారు జేసీబీలతో దండెత్తింది. ఇదేమిటని ప్రశ్నించిన గిరిజన మహిళలతో ఖాకీలు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తే నాటిన విత్తనాలు తవ్విపోస్తామంటూ రెచ్చిపోయారు. నిస్సహాయ మహిళలపై కీచకపర్వం సాగించడం పరమ దుర్మార్గం. 18 నెలల పాలనలో ఆదివాసీ గూడేలపై 22 దాడులు జరగడం దారుణం. ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు? నిజమే. ఇదివరకటి బీఆర్ఎస్ పాలన ఎక్కడ? ఇప్పటి కాంగ్రెస్ పాలన ఎక్కడ? ఎంత తేడా. ఎక్కడి నుంచి ఎక్కడకు పడిపోయామని ప్రజలు వాపోతున్నారు. సుదీర్ఘకాలంగా తండాలు, గూడేలు కోరుకున్న స్వయంపాలన అవకాశాలు కల్పిస్తూ వాటిని గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. 'మావ నాటే మావ రాజ్' నినాదాన్ని నిజం చేసింది. జీవనాధారమైన పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ గిరిపుత్రులకు పట్టాలు పంపిణీ చేసి రికార్డు సృష్టించింది. 'మావ జమీన్.. మావ పట్టా' నినాదాన్ని సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చాక ఏకకాలంలో నాలుగు లక్షల పైచిలుకు ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడం ఓ చరిత్ర. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి సీతక్క తల్లిదండ్రులు కూడా లబ్ధిదారుల్లో ఉండటం విశేషం. గిరిపుత్రులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుని హాయిగా జీవిస్తారనే చల్లని తలంపుతో ఈ మార్పులు ప్రవేశపెట్టింది బీఆర్ఎస్ సర్కారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు గిరిజనులను వారికి ప్రాణసమానమైన భూమికి దూరం చేసేందుకు వికృత మార్గాలు అనుసరించడం దుర్మార్గం.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును

# యుద్ధప్రాతిపాదికన నిర్మించాలి

### సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.శ్రీనివాస్ డిమాండ్




**బెల్లంపల్లి మే 5 మన సమాజం**

నాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శిస్తున్నట్లు ప్రచారం చేయడం కాదని తుమ్మిడి హట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణ పనులను తక్షణమే ప్రభుత్వం చేపట్టాలని సీ పీ ఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన పార్టీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు సందర్శనకు వస్తున్నట్టుగా ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయని ఆయన తెలిపారు.రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు గాని, లేదా ఆనాటి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ సృజల స్రవంతి, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ను, పట్టించుకోకుండా కేవలం చర్చల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.ఆనాటి కాంగ్రెస్ పాలనలో నే,రూ.,11, వేల కోట్ల ఖర్చు చేసి, దాదాపు 70 కిలోమీటర్లకు పైగా భారీ కాలువలు తీసి, బాహుబలి పైపులు తెప్పించి పనులకు శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు.కానిరాష్ట్రం లో బీ ఆర్ ఎస్ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత,రిడిజైన్ పేరుతో మేడిగడ్డ ప్రాజెక్టుకు తెరతీసిందన్నారు.


మేడిగడ్డ,అన్నారం, సుందిళ్లబ్యారేజీలనురూ, రూ 1,50లక్షల కోట్లతో నిర్మించిందని ఆయన పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ కమిషన్ల కక్కుర్తి తో ఇంజనీరింగ్ లోపాలు కేసీఆర్ స్వయంకృతాపరాధాలతో మేడిగడ్డ రెండు ముక్కలు చేశారాని ఆయన పేర్కొన్నారు. కాగా నేడు అన్నారం సుందిళ్ల, బ్యారేజీలకు బుంగలు పడ్డాయనిఅయన తెలిపా రు. మేడిగడ్డ ఖర్చులో సగం ఖర్చు చేస్తే పూర్తయ్యే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ఉమ్మడి జిల్లాలు ముఖ్యంగా కొమురం భీం, మంచిర్యాల జిల్లాల పట్ల వివక్షత ప్రదర్శించి ఇటు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును గాని లేదా కాగజ్ నగర్ లోని జగన్నాదుర్పూర్ ప్రాజెక్టు గానీ,అడ ప్రాజెక్టు కాలువల నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. నాడు ప్రాజెక్టు నిర్మాణం విషయంలో బీ ఆర్ ఎస్ ప్రభుత్వం, వివక్షకు గురిచేసిందని దీని ఫలితంగా మంచిర్యాల, కొమరం జిల్లాల్లో రెండు లక్షల ఎకరాలకుసాగు నీరు అందించాలన్న రైతుల డిమాండ్ ను నాటి బీ ఆర్ ఎస్ ప్రభుత్వం నీరు గార్చిందన్నారు.ముఖ్యమంత్రి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు సందర్శించడానికి మేము వ్యతిరేకం కాదు కానీ ప్రాజెక్టు నిర్మించాలని చిత్తశుద్ధిని దృఢ సంకల్పాన్ని వారు నిర్వహించే సభాముఖంగా ప్రకటించాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, నాడు బీ ఆర్ ఎస్ పాలన లో 10 సంవత్సరాల కాలంలో, వివక్షకు గురవుతున్న, అడా ప్రాజెక్టు కాలువలు, జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణం, సత్వరమే పూర్తి చేసే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రధానంగా బెల్లంపల్లి నియోజకవర్గం మీదుగా ప్రాణహిత ప్రాజెక్టు కుచ్చింది నా భారీకాలువలునాడునిర్మించారని ఈకాలువలద్వారా ఈనియోజకవర్గానికి లక్షఎకరాలకుసాగును అందించాలని,అంతేకాకుండా కొమురం భీం జిల్లా, మంచిర్యాల జిల్లా లకు రెండులక్షలఎకరాలకు సాగునీరు అందించే హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశం లో , పార్టీ కొమురం భీం జిల్లా కార్యదర్శి ఎండి చాంద్ పాషా, మంచిర్యాల జిల్లా కార్యదర్శి, ఎ లాల్ కుమార్, జిల్లా నాయకులు, తాళ్లపల్లి. శ్రీనివాస్,డీ బ్రహ్మానందం, పీ డీ ఎస్ యూ , జిల్లా అధ్యక్షులు రెడ్డి చరణ్ చరణ్,పీ వై ఎల్ నాయకులు,జీ మల్లేష్ .ఐ ఎఫ్ టీ యూ డివిజన్ నాయకులు డీ శ్రీనివాస్, ఎస్ భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కులతత్వం




జిలుగువెలుగుల కార్పొరేట్ ప్రపంచం అడుగున కులతత్వం కుళ్లు కంపు కొడుతున్నదా? మడతలు నలగని సూటూబూటూ కింద సంకుచిత కులాధిపత్యం పాకుతున్నదా? లేక వేళ్లూనుకొని కుక్కమూతి పిందెలు వేస్తున్నదా? ఇండిగో సంస్థలో ఓ ఉద్యోగికి ఎదురైన చేదు అనుభవం జాతిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇంకా వెనుకబాటుతనం పూర్తిగా మాసిపోని పల్లెటూళ్లలోనో, ఆధిపత్యవాదం రాజ్యమేలే గొప్పగొప్ప విద్యాసంస్థల్లోనో కులతత్వం ఉందంటే నిజమే అనుకోవచ్చు. అందుకు సంబంధించిన వార్తలు మనం తరచుగా వింటూనే ఉంటాం. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో చాలా చోట్ల దళిత పెండ్లిళ్లలో వరుడు గుర్రమెక్కి ఊరేగడం ప్రాణాంతకమే. పేరుమోసిన వర్సిటీల్లో దళిత బిడ్డలు వేధింపులు భరించలేక ఉసురు తీసుకునే ఉదంతాలు మన దృష్టికి ఇంకా వస్తూనే ఉన్నాయి. ఇది నవభారతం మోస్తున్న నిన్నటి శాపం, రేపటి పాపం. ఒక కార్పొరేట్ సంస్థలో 'నువ్వు అధముడివి, విమానాలు నడపడంతో నీకేం పని.. పోయి చెప్పులు కుట్టుకో' అని తోటి ఉద్యోగులు ఓ దళిత బహుజన పైలట్‌ను దారుణంగా అవమానించడం ఏమిటి? చెప్పులు కుట్టే చేతులు విమానాలు నడపొద్దని రాజ్యాంగం ఏమైనా చెప్తున్నదా? భారతదేశానికి కులవివక్ష కొత్త కాదు. కానీ, కార్పొరేట్ తెరమీద అది మరీ ప్రస్ఫుటంగా ప్రత్యక్షం కావడం ఆలోచింపజేస్తున్నది. ఉద్యోగి తన బాస్‌ల మీద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దాఖలైంది. విచారణలో ఏం తేలుతుందనేది వేరే సంగతి. కానీ, ఈ ఘటనతో కార్పొరేట్ ప్రపంచంలో కులతత్వంపైకి అందరి దృష్టి మళ్లింది. ఆర్థిక సరళీకరణల భుజాలపై ఊరేగుతూ ప్రపంచీకరణ దూసుకొస్తున్న రోజుల్లో ప్రపంచం ఓ కుగ్రామంలా మారుతున్నదనే మాట తరచుగా వినిపించేది. అడ్డుగోడలు తొలగిపోతున్నాయన్న భావనలు పురివిప్పుకొన్నాయి. భారత్ అంతకంతకూ విశ్వ ఆర్థికవ్యవస్థతో పెనవేసుకుపోతున్న నేపథ్యంలో మన నేతలు తరచుగా వసుధైవ కుటుంబం అనే భావనను పదేపదే ఉల్లేఖించడం పరిపాటి అయిపోయింది. కానీ, ఆ ఉదాత్త భావనను సాధించడానికి భారత్ ఇంకా చాలాచాలా దూరంలో ఉన్నదని ఇటీవల ఈ గడ్డ మీద జరుగుతున్న సంకుచిత కుల వైషమ్యాలు సూచిస్తున్నాయి. ప్రైవేటీకరణ జోరులో విస్తరించిన కార్పొరేట్ ప్రపంచంలో కులాతీత, ప్రజ్ఞ ఆధారిత ప్రోత్సాహమే ఉందనేది సాధారణ అవగాహన. కానీ, ఇండిగో ఉదంతం ఇదంతా భ్రమేనని అంటున్నది. కులవ్యవస్థ అనేది శ్రమ విభజన మాత్రమే కాదని, అది శ్రామికుల విభజన అని అంబేద్కర్ చేసిన సూత్రీకరణ ఇక్కడ గుర్తుకువస్తున్నది. కార్పొరేట్ ఆధిపత్య వ్యవస్థ అన్ని సామాజిక వర్గాలకు సమప్రాధాన్యత ఇచ్చే వ్యవస్థగా రూపొందేందుకు ప్రయత్నిస్తున్న మాట నిజమే. కానీ, ఆ దిశగా నిచ్చెనలు అందుకునేలోగా కులతత్వం పాములు కిందకు ఈడ్చేయకుండా చూసుకోవాలి.

## జలమే మానవాళికి జీవనాధారం



**బెంగళూరు:** బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వంసం చేయడం, చెరువుల, కాలువను ధ్వంసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం. కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018-2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టైనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 2,97,000 మంది అంటే సుమారు రోజుకు 800 మంది పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. ఈ కారణాల చేత ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి వాననీటిని ఒడిసి పట్టడమే కాకుండా,నీటినిజాగ్రత్తగా వాడుకునే విధంగా వ్యవహరించాలి.

# లిఫ్ట్ ఇచ్చి చైన్ స్నాచింగ్.. నిందితుడు రిమాండ్

## దౌల్తాబాద్ మండలం కేంద్రంలోని గత నెల 26న జరిగిన సంఘటన

**దౌల్తాబాద్, మే 5**

లిఫ్ట్ ఇస్తానని నమ్మబలికి మహిళపై చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సిఐ లతీఫ్ తెలిపారు. మంగళవారం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ లో తొగుట సిఐ లతీఫ్, స్థానిక ఎస్ ఐ అరుణ్ కుమార్ తో కలిసి చైన్ స్నాచింగ్ చేసిన నిందితుడికి వివరాలు వెల్లడించారు. గత నెల 26 న సాయంత్రం సుమారు 8 గంటల సమయంలో దీపాయం పల్లి గ్రామానికి చెందిన ఒక మహిళ దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఆటో కోసం వేచి ఉండగా, అప్పటికే కాపు కాచిన ఓ గుర్తుతెలియని వ్యక్తి తాను గొడుగుపల్లి గ్రామానికి వెళ్తున్నానని ఆ మహిళకు చెప్పి మోటార్ సైకిల్‌పై లిఫ్ట్ ఇచ్చాడు. అనంతరం దౌల్తాబాద్ నుంచి దీపాయం పల్లి గ్రామ శివారులోకి కల్వర్ట్ వద్దకు చేరుకున్న తర్వాత బండిలో పెట్రోల్ అయిపోయిందని అమ్మాయిలకు చెప్పి మోటార్ సైకిల్ ను ఆపేశాడు. మహిళను మాయమాటలతో మోసం చేసి, ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు తాడు, 2 గ్రాముల బంగారు చెవి కమ్మలు, 20 తులాల వెండి కాళ్ల పట్టీలు లాక్కొని పరారయ్యాడు. ఆ మహిళ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దౌల్తాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు. రామారం గ్రామం, రాయపోల్ మండలానికి చెందిన ఎరుకలి శ్రీను (30)ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి 3 తులాల బంగారు తాడు, 2 గ్రాముల బంగారు చెవి కమ్మలు, 20 తులాల వెండి కాళ్ల పట్టీలు స్వాధీనం చేసుకున్నారు.


చైన్ స్నాచింగ్ చేసిన నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న తొగుట సిఐ లతీఫ్, ఎస్ ఐ అరుణ్ కుమార్

**ప్రజలకు హెచ్చరిక**

అపరిచితులు లిఫ్ట్ ఇస్తామని చెప్పినప్పుడు వారి మాటలు నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు మహిళలకు ప్రజలకు సూచించారు.

# "హుస్నాబాద్ మార్కెట్ యార్డులో నాసిరకం కరెంట్"

## బ్రేకర్లు పడిపోతే రైతులకు పెరుగుతున్న కష్టాలు!


ధాన్యం క్లీన్ చేసే మిషన్

**హుస్నాబాద్ టౌన్, మే 5 :**

హుస్నాబాద్ మార్కెట్ యార్డులో నాసిరకం విద్యుత్ వ్యవస్థ రైతులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. యార్డులో అమర్చిన తక్కువ సామర్థ్యం గల బ్రేకర్లు, నాసిరకం వైరింగ్ కారణంగా ధాన్యం పట్టే యంత్రాలు గత నాలుగు రోజులుగా సరిగా పనిచేయడం లేదు. యంత్రాలు ప్రారంభమైన వెంటనే బ్రేకర్లు పడిపోవడంతో రైతులు పనులు ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్ యార్డ్ ఆధునిక భవనం నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ తక్కువ అంప్స్ బ్రేకర్లు, తక్కువ గేజ్ వైర్లు వినియోగించడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 20 నుండి 30 వరకు యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ, విద్యుత్ అంతరాయం వల్ల అవి పనిచేయలేకపోతున్నాయి. ఒకే ఫేస్ ద్వారా మొత్తం మార్కెట్‌కు విద్యుత్ సరఫరా చేయడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. తరచూ బ్రేకర్లు పడిపోవడంతో రైతులే స్వయంగా వాటిని సరిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ ప్రక్రియలో ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యుత్ నిపుణుల సూచనల ప్రకారం, మెయిన్ ఫేస్‌ను విభజించి పలు బ్రేకర్లు అమర్చడం, అల్యూమినియం వైర్ల స్థానంలో కాపర్ వైర్లు వినియోగించడం ద్వారా సమస్యను తగ్గించవచ్చని తెలుస్తోంది. మార్కెట్ పాలకవర్గం తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని దీూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

# నోరు మెదపని అనంతబాబు!

## ఎన్నిసార్లు అడిగినా తనకేమీ తెలియదనే సమాధానం



**కాకినాడ, రాజమహేంద్రవరం, మే 5 :**

"మీరు ఎన్నిసార్లు అడిగినా.. ఎంత ఒత్తిడి చేసినా ఒక్కటే సమాధానం. నాకేమీ తెలియదు. నాకు అసలు సంబంధమే లేదు. ఈ కేసులో కావాలని నన్ను ఇరికించారు. అంతకుమించి నేనేమీ చెప్పలేను." ఇదీ వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు పోలీసు విచారణలో ఇచ్చిన సమాధానం. దళిత యువకుడు, కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను ప్రలోభపెట్టి, బెదిరించిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అనంతబాబును పోలీసులు మంగళవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయన్ను ఒకరోజు పాటు విచారించనున్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు అనంతబాబును కాకినాడ సర్పవరం పోలీసుస్టేషన్ వద్ద ఉన్న రూరల్ క్రైమ్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడ పోలీసు భద్రత మధ్య ఆయన్ను విచారించారు. కేసు దర్యాప్తు అధికారి, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావుతో పాటు ఇద్దరు సీఐలు, ఇతర సిబ్బంది ఈ విచారణలో పాల్గొన్నారు. రెండున్నర గంటలకు ఒకసారి చొప్పున విడతల వారీగా ఈ విచారణ సాగింది. గతంలో వేసిన 30 ప్రశ్నలకు అదనంగా మరో 20 ప్రశ్నలు జోడించి, మొత్తంగా 50 ప్రశ్నలతో జాబితా సిద్ధం చేశారు. "సాక్షుల బెదిరింపు, ప్రలోభపెట్టడం అనే ఆలోచన ఎలా వచ్చింది?, ఈ సలహా ఎవరిచ్చారు? ఆ సమయంలో ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారు?, వైసీపీ నేత కడియాల చిన్నబాబు(ఏ2), కడియాల సతీశ్ (ఏ3), మాగంటి రాంబాబు (ఏ4), చక్కపల్లి శ్రీనివాసరావు (ఏ5)లతో మీకున్న సంబంధం ఏమిటి?, ఇంకా ఎంతమందిని బెదిరించాలని అనుకున్నారు?, ఈ కుట్ర వెనుక ఎవరెవరి పాత్ర ఎంత?, గతనెలలో మిమ్మల్ని పోలీసులు అరెస్టు చేసేందుకు శ్రీరామ్‌నగర్ శంకర్ టవర్స్‌లోని మీ అపార్ట్‌మెంట్‌కు వచ్చినప్పుడు ఎలా తప్పించుకోగలిగారు?, మీకు ముందస్తు సమాచారం ఇచ్చింది ఎవరు? ఆ రోజు అక్కడ దొరికిన రూ.12లక్షలు ఎవరివి? ఎవరి కోసం అంత డబ్బు అక్కడ ఉంచారు?, ఆ డబ్బు ఎక్కడిది?"... ఇలా అనేక ప్రశ్నలను పోలీసులు సంధించారు. రాత్రి 11 గంటల వరకూ విచారణ కొనసాగింది. ఈ ఒక్కరోజు విచారణకు అనంతబాబు సహకరించపోతే కస్టడీ పొడిగించాలని కోర్టును కోరతామని దర్యాప్తు అధికారి తెలిపారు. డ్రైవర్ హత్యకేసుకు సంబంధించి అనంతబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో ఇప్పటికే వాదోపవాదనలు పూర్తయ్యాయి. ఈ కేసులో కోర్టు బుధవారం తీర్పు చెప్పనుంది.

# ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ నిలుపుదల..

## ఇంటర్ విద్యలో సంస్కరణల అమలు లక్ష్యంతోనే నిర్ణయం

**హైదరాబాద్, మే 5**

ఇంటర్ ప్రవేశాల ప్రక్రియకు బ్రేక్ పడింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, గురుకులాల్లో ఈ నెల 8 నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించాలని, జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభించాలని ఇంటర్ విద్య కార్యదర్శి అభిలాష సోమవారం ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. 24 గంటల్లోపే వాటిని నిలుపుదల చేస్తూ అభిలాష మంగళవారం మరో ఉత్తర్వు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేదాక ప్రవేశాలు చేపట్టవద్దని అందులో స్పష్టం చేశారు. ఇంటర్ విద్యలో కొన్ని సంస్కరణలు అమలు చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టబోయే సంస్కరణలపై చర్చ నడుస్తోంది. పలుచోట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్యాంపస్‌లోనే జూనియర్ కాలేజీలు కూడా ఉన్నాయి. అలాగే కొత్త విద్యాసంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు కానున్నాయి. ఇందులో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బోధన ఉంటుంది. ఒకే క్యాంపస్‌లో 12వ తరగతి వరకు ఉన్న చోట్ల ప్రవేశాలు ప్రత్యేకంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. పాఠశాల విద్య 12వ తరగతి వరకు ఉండాలని జాతీయ విద్యా విధానంలో పొందుపరిచారు. ఇదే విషయాన్ని రాష్ట్ర విద్యా కమిషన్ సైతం ఇటీవలే ప్రభుత్వానికి ప్రతిపాదించింది. పది తర్వాత ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ బోర్డు పరీక్షలు ఉండటంతో విద్యార్థులపై ఒత్తిడి తీవ్రంగా ఉంటోందని, దీనిని తగ్గించేందుకు ఫస్టియర్ బోర్డు పరీక్షలు తొలగించాలని విద్యా కమిషన్ సూచించింది. ఇంటర్ బోర్డును పాఠశాల విద్యలో విలీనం చేయాలని, డిగ్రీలో దోస్త్ తరహాలోనే ఇంటర్లోనూ ఆన్‌లైన్ ప్రవేశాలు చేపట్టే ప్రతిపాదన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

# విజయ్ డ్రైవర్ కుమారుడు ఇప్పుడు ఎమ్మెల్యే




**చెన్నై, మే 5 :**

తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన టీవీకే అధినేత విజయ్.. అభ్యర్థుల ఎంపికలో తీసుకున్న నిర్ణయాలు కూడా సంచలనంగా మారాయి. చాలాకాలంగా తన వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌కు ఆయన ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. చెన్నై నడిబొడ్డున విరుగంబాక్కం నియోజకవర్గం నుంచి పోటీచేసిన శబరినాథన్ 27,086 ఓట్ల మెజారిటీతో డీఎంకే నేత ఏఎంవీ ప్రభాకర్ రాజాపై విజయం సాధించారు. విజయ్ తన పేరు ప్రకటించినప్పుడే తీవ్ర భావోద్వేగానికి గురైన శబరినాథన్.. ఆయన కాళ్లకు సాష్టాంగ నమస్కారం చేశారు. ఆయనను హత్తుకున్న విజయ్..'నా ఫోటో పెట్టుకుని ప్రచారం చెయ్.. ఎమ్మెల్యేగా కనిపించు..' అని వెన్నుతట్టి పంపించినట్లు సమాచారం. ఆయన చెప్పినట్లే ఎమ్మెల్యేగా గెలిచిన శబరినాథన్.. మంగళవారం టీవీకే శాసనసభాపక్ష సమావేశానికి హాజరయ్యారు.

# మమత సహా 22 మంది మంత్రులు అవుట్

**కోల్‌కతా, మే 5:**



మమతా బెనర్జీ క్యాబినెట్‌లో 35 మంది మంత్రులు ఉండగా.. ఆమెతో పాటు 22 మంది మంత్రులు తాజా ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఆమె ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతకు ఇదే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మమత (భవానీపూర్), అరూప్ బిశ్వాస్ (టోలీగంజ్), బ్రత్య బసు (డమ్‌డమ్), చంద్రిమ భట్టాచార్య (డమ్ డమ్ ఉత్తర్), శశి పాంజా (శ్యామ్‌పుకుర్), సుజిత్ బోస్ (బిధాన్‌నగర్), ఇంద్రనీల్ సేన్ (చందన్‌నగర్), బేచరమ్ మన్నా (సింగూర్), స్వపన్ దేబ్‌నాథ్ (పూర్బస్థలి దక్షిణ్), బులూచిక్ బరాయక్ (మాల్), ప్రదీప్ కె.మజుందార్ (దుర్గాపూర్ పూర్బ), బీర్బహ హంస్‌దా (బీన్‌పూర్), మానసరంజన్ భునియా (సాబంగ్), మలయ్ ఘాతక్ (అసన్‌సోల్ ఉత్తర్), సిదికుల్లా చౌధురి (మోంటేశ్వర్), ఉదయన్ గుహ (దిన్హత), బంకించంద్ర హాజ్రా (సాగర్), సంధ్యారాణి టుడు (మన్‌బజార్), ఉజ్వల్ బిశ్వాస్ (కృష్ణనగర్), స్నేహాశీశ్ చక్రవర్తి (జాంగిపారా), శ్రీకాంత్ మహతో (సల్బోని), సత్యజిత్ బర్మన్ (హెమ్టాబాద్).. బీజేపీ అభ్యర్థుల చేతుల్లో పరాజయంపాలయ్యారు. ఈ మంత్రుల్లో అత్యధికులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే. ఇక, రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాలకు గాను 9 జిల్లాల్లో టీఎంసీ ఖాతాయే తెరవలేదు. ఈ 9 జిల్లాలు.. పూర్వ మేదినీపూర్, పురూలియా, బంకురా, జార్గ్రమ్, డార్జిలింగ్, కలింపాంగ్, జల్పాయ్‌గురి, ఆలీపురద్వార్, పశ్చిమ బర్ధమాన్‌ల్లోని మొత్తం 68 స్థానాలనూ బీజేపీయే గెలుచుకోవడం మరో విశేషం.

# కాంగ్రెస్‌లో ఆత్మపరిశీలన కావాలి

## కేరళం వ్యూహాలను ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలి: శశిథరూర్

**తిరువనంతపురం, మే 5:**



తాజా ఎన్నికల ఫలితాల్లో కేరళం మినహా ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రదర్శనపై ఆ పార్టీ సీనియర్ నేత శశి థరూర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో తగిలిన ఎదురుదెబ్బల నేపథ్యంలో పార్టీలో లోతైన ఆత్మపరిశీలన జరగాలని పేర్కొన్నారు. పార్టీ ప్రదర్శన ఏమాత్రం ఆశాజనకంగా లేదని, ప్రచార వ్యూహాలు, సంస్థాగతంగా బలోపేతం కావడం, ఓటర్లను ఆకట్టుకోవడం వంటి అంశాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని అంగీకరించారు. కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించడం వెనుక ఉన్న కారణాలను అధ్యయనం చేయాలని, జాతీయ స్థాయిలో పార్టీ పరిస్థితి మెరుగుపడటానికి ఇలాంటి వ్యూహాలనే ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని సూచించారు. మోదీ, అమిత్ షా అనుసరించిన ఎన్నికల వ్యూహాలను ఆయన ప్రశంసించారు. ఎన్నికల నిర్వహణలో బీజేపీ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు.

# ఐదోసారి పగ్గాలు చేపట్టనున్న రంగస్వామి..!

## గత క్యాబినెట్‌లానే పుదుచ్చేరిలో ఈసారీ సంకీర్ణమే

**పుదుచ్చేరి, మే 5:** పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఘన విజయం



సాధించిన రంగస్వామి ఐదోసారి పుదుచ్చేరి సీఎం పీఠం ఎక్కడానికి రంగం సిద్ధమయింది. ఆయన పార్టీ ఏఐఎన్ఆర్‌సీ అత్యధిక సీట్లు గెలుచుకున్న పార్టీగా అసెంబ్లీలో నిలిచింది. మొత్తం 16 స్థానాల్లో పోటీ చేయగా 12 చోట్ల విజయం సాధించింది. 30 సీట్లున్న అసెంబ్లీలో అధికారం చేపట్టాలంటే 16 మంది బలం ఉండాలి. బీజేపీ నాలుగు సీట్లు గెలుచుకోగా, ఏఐఏడీఎంకే, ఎల్‌జేకే ఇతర ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలను కలుపుకొంటే మొత్తం బలం 18కి చేరుకుంటుంది. వీరికితోడు ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఉండనే ఉన్నారు. పాండీ కొత్త అసెంబ్లీకి నేతగా రంగస్వామి ఎంపిక నామమాత్రమే. గత క్యాబినెట్ మాదిరే ఈసారి కూడా సంకీర్ణ మంత్రి వర్గం ఏర్పడనుంది. సాధారణంగా మంత్రివర్గ సభ్యుల సంఖ్య ఆరుకు మించదు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి 6 సీట్లు గెలుచుకుంది. డీఎంకేకు ఐదు రాగా, కాంగ్రెస్‌కు ఒకే ఒక్క స్థానం దక్కింది.




## జోస్యం ఫలించింది!

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ సరికొత్త చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. అందరి అంచనాల్ని తలక్రిందులు చేస్తూ అతిపెద్ద పార్టీగా అవతరించడంతో సినీ ప్రముఖుల నుంచి దళపతి విజయ్‌కి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అగ్ర కథానాయిక పూజాహెగ్డే ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. త్వరలో విడుదల కాబోతున్న విజయ్ 'జన నాయగన్' చిత్రంలో పూజాహెగ్డే కథానాయికగా నటించిన విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ టైమ్‌లో తీసుకున్న ఓ సరదా వీడియోను పూజాహెగ్డే ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఇందులో ఆమె ఓ వైట్ బోర్డ్ మీద 'వచ్చే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు?' అనే క్యాప్షన్‌ను రాసి దానిని పక్కనే ఉన్న విజయ్‌కి చూపిస్తూ సరదాగా కనిపిస్తున్నది. ఈ వీడియోను షేర్ చేసిన పూజాహెగ్డే 'నేను ఈ విజయాన్ని ముందే ఊహించాను. కలలు నిజం కావడం చాలా ఆనందంగా ఉంది విజయ్ సార్' అంటూ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పూజాహెగ్డే జోస్యం ఫలించిందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

### నటితో నిశ్చితార్థం జరుపుకున్న

# పటాస్ ప్రవీణ్

టెలివిజన్ రంగంలో ప్రత్యేక హాస్యంతో ప్రేక్షకులను అలరించిన ప్రవీణ్ జీవితంలో మరో



కీలక దశలోకి అడుగుపెట్టాడు. జబర్దస్త్, పటాస్ వంటి పాపులర్ షోలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ కమెడియన్, తన వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాడు. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్న నటి, డ్యాన్సర్ కడెం వంశితతో ప్రవీణ్ తాజాగా నిశ్చితార్థం చేసుకున్నాడు.ఇద్దరి నిశ్చితార్థం వేడుక కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సింపుల్‌గా జరిగింది. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన ఈ జంట, తమ క్యూట్ లుక్స్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నారు. ప్రవీణ్ తన కెరీర్‌ను చిన్న చిన్న స్టేజ్ షోలతో ప్రారంభించి, తర్వాత జబర్దస్త్ ద్వారా విపరీతమైన క్రేజ్ సంపాదించాడు. తన టైమింగ్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీతో ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. ఇక పటాస్ షోలో కూడా తన హాస్యంతో మంచి గుర్తింపు పొందాడు. ఇక వంశిత కూడా నటి, డ్యాన్సర్‌గా టెలివిజన్ రంగంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంది. సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ తన డ్యాన్స్ వీడియోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ ఇద్దరి మధ్య ప్రేమ కొంతకాలంగా కొనసాగుతూ ఉండగా, ఇప్పుడు అది వివాహ బంధంగా మారబోతోంది. ప్రవీణ్ – వంశిత నిశ్చితార్థం వార్త తెలిసిన వెంటనే టీవీ ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. త్వరలోనే వీరి వివాహం జరగనుందని సమాచారం.అయితే ఫైమా బిగ్ బాస్‌లోకి వెళ్లే ముందు వరకు ప్రవీణ్‌తో మంచి అనుబంధం మెయింటైన్ చేసింది. అయితే బిగ్ బాస్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మాత్రం ఇద్దరూ కలిసి కనిపించకపోవడంతో, వీరిద్దరి మధ్య బ్రేకప్ జరిగిందనే వార్తలు విస్తృతంగా ప్రచారం అయ్యాయి.ఈ విషయంపై తర్వాత ఒక ఇంటర్వ్యూలో స్పందించిన ఫైమా, చిన్న చిన్న అపార్థాల వల్ల తాత్కాలికంగా దూరమయ్యామని వెల్లడించింది. "ఇప్పుడు మేము బాగానే మాట్లాడుకుంటున్నాం. మా రిలేషన్ గురించి మాకు క్లారిటీ ఉంది" అంటూ ఆమె స్పష్టం చేసింది.

## 1990 నేపథ్యంలో..



నరేష్, నాగమణి జంటగా నటిస్తున్న చిత్రం 'మారణహోమం 1990ం'. ఎస్‌కేఎస్ ఫిల్మ్స్ పతాకంపై బంధు నరేష్ దర్శకత్వంలో నాగమణి నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర టీజర్, ఫస్ట్‌లుక్‌ను సీనియర్ హీరో శ్రీకాంత్ విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందజేశారు. 1990 దశకం నేపథ్యంలో జరిగే కథ ఇదని, ఆసక్తికరమైన కథ, కథనాలతో ఆకట్టుకుం టుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిందని, త్వరలో విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. దీప్తిరెడ్డి, లౌక్య, భాను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నవనీత్‌చారి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: బంధు నరేష్.

## విభిన్న కథ టార్టాయిస్



రాజ్‌తరుణ్, అమృతచౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'టార్టాయిస్'. రిత్విక్ కుమార్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణా నంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'విభిన్నమైన కథాంశమిది. హీరోకి నిద్రలో నడిచే అలవాటు ఉంటుంది. ఈ క్రమంలో అతను ఓ అమ్మాయిని చంపేస్తాడు. తర్వాత ఏం జరిగింది?' అన్నది ఉత్కంఠను రేకెత్తిస్తుంది' అని చెప్పారు. శ్రీనివాస్ అవసరాల, ధన్యబాలకృష్ణ, రవి కాలే, షిజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్, నిర్మాతలు: విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు, మధుపాల సురేష్, కథ, దర్శకత్వం: రిత్విక్ కుమార్.

# 'టాక్సిక్'లో బోల్డ్ సీన్స్ వివాదం..

### కియారా అద్వానీ క్లారిటీతో పుకార్లకు చెక్



కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని హాట్ సీన్స్‌ను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామరస్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో ఘాటైన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి. అయితే ఈ మొత్తం ప్రచారంపై కియారా అద్వానీ స్వయంగా స్పందిస్తూ స్పష్టమైన క్లారిటీ ఇచ్చింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఆమె.. "నేను ఎలాంటి సన్నివేశాల విషయంలోనూ మార్పులు కోరలేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమైన పుకార్లే" అని పేర్కొంది. దీంతో ఈ వివాదానికి పూర్తిగా తెరపడినట్లైంది. ఈ చిత్రం టీజర్ విడుదలైనప్పటి నుంచి కియారా పాత్ర చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆమె లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, సినిమా కథపై కూడా ఆసక్తిని పెంచింది. అయితే అధికారిక సమాచారం లేకుండానే పుట్టుకొచ్చిన ఊహాగానాలు ఒక్కసారిగా వైరల్ కావడం ఈ ఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. యష్ -- కియారా కాంబినేషన్ కూడా సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ధృవీకరించని వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతాయో 'టాక్సిక్' వివాదం మరోసారి నిరూపించింది. అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వార్తలను నమ్మడంలో జాగ్రత్త అవసరమని ఈ సంఘటన సూచిస్తోంది .